క్లుప్తంగా

ప్రగతి సాధించేందుకు సలహాలు దోహదం



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ కర్తార్‌సింగ్ గుర్జర్

పెద్దారవీడు: ప్రముఖుల సలహాలు విద్యార్థులు మరింత ప్రగతి సాధించేందుకు దోహదపడతాయని ప్రిన్సిపాల్ కర్తార్‌సింగ్ గుర్జర్ అన్నారు. మండలంలోని రాజంపల్లి సమీపంలో కేంద్రియ విద్యాలయంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన తృతీయ సోపాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిబిరం సోమవారం విజయవంతంగా ముగిసింది. ఆయన మాట్లాడుతూ నిర్దిష్ట నైపుణ్యాలను మెరుగుపర్చడం, ఖ్యాతి సాధించే స్థాయికి ప్రతి విద్యార్థి చేరుకోవాలని ఆకాంక్షించారు. శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా విస్తృత ప్రయత్నాలు, నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. స్కౌటింగ్ డ్యూటీ, ప్రథమ చికిత్స తదితర అంశాలపై విద్యార్థులు శిక్షణ పొందారు. గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. నాలుగు రోజు పాటు జరిగిన వివిధ కార్యక్రమాల్లో దేశవ్యాప్తంగా 31 కేంద్రియ విద్యాలయాలకు సంబంధించిన విద్యార్థులు 250 మంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో చిన్నారుల ప్రతిభ



చిన్నారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

త్రిపురాంతకం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విశ్వనాథపురం విద్యార్థినులు ప్రతిభ చాటారు. మండలంలోని విశ్వనాథపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు జిల్లా స్థాయిలో యర్రగొండపాలెంలో జరిగిన పోటీల్లో అండర్‌-14 విభాగంలో హైజంప్, లాంగ్‌జంప్, పరుగు పందెంలో టి.అమూల్య ప్రథమ స్థానం, పీవీ కావ్య ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్‌-16 విభాగంలో కె.ఇందు పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచారు. బాపట్లలో జరిగే పోటీల్లో వీరు జిల్లా తరఫున ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, పీడీ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.





స్కూళ్లు వదిలిన అనంతరం వర్షం నీటిలో ఇబ్బంది పడుతూ ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

వీధుల్లో ఏరులై పారుతున్న వర్షం నీరు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

యర్రగొండపాలెం: కొద్దిపాటి వర్షం కురిసినా పట్టణంలోని వీధుల్లో నీరు ఏరులై పారుతుంది. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సైడ్ కాలువలు లేక పోవడం, రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో నీరు ఎక్కడికి అక్కడే నిల్వ చేరుతుంది. వర్షం నీరు ఎటూ వెళ్లేందుకు వీలుపడక ఇళ్లల్లోకి వస్తున్నాయని, ఈ నీటితో విష పురుగులు చేరుతున్నాయని ఆయా ప్రాంతాలకు చెందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కురిసిన వర్షంతో ఒంగోలు వారి వీధిలో తటాకంలా నీరు ప్రవహించింది. బ్రహ్మంగారి గుడి వద్ద ఉన్న మండల పరిషత్ పాఠశాలల సముదాయం నుంచి విద్యార్థులు తమ గృహాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ పాఠశాలలకు పడమటి బజార్, ఇజ్రాయిల్‌పేట, రాములవారి వీధి, చాకలివారి వీధి, ఒంగోలు వారి వీధి ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో వెళ్తుంటారు. పాఠశాలలు వదిలే సమయంలో వర్షం పడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లలను క్షేమంగా ఇళ్లకు చేర్చుకునేందుకు అనేక మంది పాఠశాలల వద్దకు పరుగులు పెట్టారు. మరి కొంతమంది విద్యార్థులు చేసేదిలేక తమ పుస్తకాల బ్యాగ్‌ను బుజాలపై పెట్టుకొని అతి కష్టంపై తమ గృహాలకు చేరుకున్నారు. అధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో రోడ్లు, సైడ్ కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



తటాకం కాదు.. ఒంగోలు వారి వీధి

క్రీస్తు మార్గంలో నడుస్తూ మంచి పనులకు బీజం వేయాలి

- దర్శి రీజియన్ పాస్టర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

దర్శి: పాస్టర్‌లు క్రీస్తు మార్గంలో నడుస్తూ మంచి పనులకు బీజం వేయాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ అన్నారు. దర్శి రీజియన్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అనంతరం దర్శి నియోజకవర్గ సమావేశం కురిచేడు రోడ్డులోని కవనెంట్ చర్చిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాలిమూటి దేవప్రసాద్ మాట్లాడుతూ పాస్టర్‌లు కలిసికట్టుగా మంచిని బోధించాలని, ప్రజల్లో చెడు ఉద్దేశాలు లేకుండా చేయడంలో ముఖ్య పాత్ర పోషించాలని చెప్పారు. మంచి, చెడులు ప్రార్థనల్లో తెలియజేసి క్రీస్తుమార్గంలో నడిపించాలని సూచించారు. పాస్టర్‌ల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గ అధ్యక్షుడిగా గల్లెపోగు ఏసుదాసు, ఉపాధ్యక్షులుగా జీఎస్ పాల్, యామర్తి మోహన్‌రావు, కార్యదర్శిగా పాలకిటి చిన్నబాబు, సంయుక్త కార్యదర్శిగా దాసరి కోటేశ్వరరావు, కోశాధికారిగా గార్లపాటి కోటయ్య, కార్యవర్గ సభ్యులుగా బూదాల నాయుడు, గంగవరపు దానియేలు, రాపూరి ఏలీయాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం దర్శి నియోజకవర్గంలోని 5 మండలాల పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. దర్శి మండల అధ్యక్షుడిగా బెజవాడ అనిల్, కురిచేడు మండల అధ్యక్షుడిగా గండి సుందరరావు, దొనకొండ మండల అధ్యక్షుడిగా గుడిమెట్ల యెషయా, తాళ్లూరు మండల అధ్యక్షుడిగా రమణారెడ్డి, తాళ్లూరు, దర్శి, కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు మండలాలకు చెందిన 100 మంది పాస్టర్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ఊరేగుతున్న పోలేరమ్మ తల్లి విగ్రహాలు

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెంలో తొమ్మిది రోజుల పాటు గ్రామ దేవత పోలేరమ్మ తల్లి కొలుపులు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి రెండు రోజులు ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మ తల్లి నూతన విగ్రహంతో పాటు బొల్లావులు, పావనం, వీర తాళ్ల విగ్రహాలను గ్రామ ప్రజలు సోమవారం ఊరేగింపుగా ఆలయం వద్దకు చేర్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వారు పోస్తూ కొబ్బరికాయలు కొట్టారు. గ్రామ ప్రజలు, బంధుమిత్రులు కులాలకు అతీతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తల్లిపాలు బిడ్డకు తప్పకుండా అందించాలి



తల్లిపాల ప్రాముఖ్యత వివరిస్తున్న వెంకట్రావు

కురిచేడు: తల్లులు విధిగా తమ బిడ్డలకు పాలు పట్టించాలని ఐటీసీ ప్రథమ్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకట్రావు పేర్కొన్నారు. స్థానిక నుసుం బజార్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ వెంకట్రావు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డల హక్కు అని, రెండేళ్ల వరకు తల్లిపాలు అందించాలని సూచించారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలోపు వచ్చే ముర్రుపాలు బిడ్డ వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. మొదటి ఆరు నెలల్లోపు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, ఎటువంటి డబ్బాపాలు, ఇతర ఆహార పదార్థాలు ఏవీ తినిపించకూడదని తెలిపారు. 6 నెలల నుంచి 2 సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు అదనపు పౌష్టికాహారం అందించాలన్నారు. ఇది పిల్లల్లో సరైన బుద్ధి వికాసానికి, శారీరక ఎదుగుదలకు అవసరం అవుతుందన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల ర్యాలీ చేశారు. కార్యకర్తలు ఫాతిమా, ప్రభావతి పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలి



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీ వెంకట రమణ

పుల్లలచెరువు: గ్రామాల్లోని రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, మందులు వాడుకోవాలని, అలా చేస్తే పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ సంచాలకులు వెంకట రమణ తెలిపారు. సోమవారం మండలంలోని శతకోడు రైతులకు ఆత్మ ఆధ్వర్యంలో భూ సారవంతం-యాజమాన్య పద్ధతులు అనే అంశంపై ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి వెంకట రమణ మాట్లాడుతూ ఖరీఫ్‌-2025లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, మందులు వాడుకోవాలని చెప్పారు. దీంతో పెట్టుబడి తగ్గి పంట దిగుబడులు నాణ్యంగా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. జీవ రసాయన ఎరువులు వాడకం కూడా పంటలకు మంచిదని, వాటిని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. రైతులు అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఎంపీపీ వెంకటయ్య, సర్పంచ్ జ్యోతి, ఏవో గోపీకృష్ణ, వీఏఏలు కొండా నాయక్, ఫయాజ్ పాల్గొన్నారు.

మడియాలయ్య దేవరకు మొక్కులు తీర్చుకున్న భక్తులు



దేవరకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

పుల్లలచెరువు: వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు బాగా పండాలని మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం వారి ఇలవేల్పు మడియాలయ్య దేవరకు బోనాలు సమర్పించారు. రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామంలో రజకులంతా పాల్గొని బోనాలతో మడియాలయ్య దేవరను సందర్శించుకుని వానలు సకాలంలో కురిసి పంటలు బాగా పండి పాడిపంటలతో తులతూగాలని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి శావణమాసంలో ఈ బోనాలు సమర్పిస్తామని రజక సంఘ నాయకులు గాలెయ్య తెలిపారు. దేవరకు మొక్కుబడిగా ప్రభను ఏర్పాటు చేసి ఊరేగింపు గ్రామ పురవీధుల్లో భక్తి పాటలు పాడుకుంటూ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ మురుగు



అంగన్‌వాడీ కేంద్రం ఎదుట మురుగు

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలోని బేతేలుపురం అంగన్‌వాడీ కేంద్రం-1 వద్ద మురుగు నిల్వ ఉండి ఆ ప్రాంతం అధ్వానంగా తయారైంది. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రంలో కూర్చునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముక్కు మూసుకుని కూర్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది. సుమారు 40 మంది చిన్నారులు ఉన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త ఎన్నో సార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితంగా లేకుండా పోయింది. చిన్నారులను కేంద్రానికి పంపేందుకు తల్లిదండ్రులు నిరాకరిస్తున్నారు. అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని బెంబేలెత్తుతున్నారు. స్థానిక ఎంపీటీసీ గుంటు అమ్మాజీ ఎన్నో సార్లు పంచాయతీ వారికి తెలియజేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం వద్ద మురుగు నీరు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తిని వివరణ కోరగా మురుగు నీరు ఉన్న మాట వాస్తవేమనని, రెండు మూడు రోజుల్లో మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎమ్మెల్యే తాటిపర్తికి ఆర్యవైశ్యుల సన్మానం



ఎమ్మెల్యే తాటిపర్తిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్‌ను ఆర్యవైశ్య సంఘ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా దొగిపర్తి సంతోష్‌కుమార్‌ను నియమించిన సందర్భంగా వారు కృతజ్ఞతగా ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు పబ్బిశెట్టి శ్రీనివాసులు, కందూరి కాశీవిశ్వనాథ్, సూరె శ్రీనివాసులు, సూరె ప్రసాద్, కాకుమాని సురేష్, గోళ్ల కృష్ణారావు, వేముల నరేష్‌కుమార్, కందూరి రాజబాబు, దొగిపర్తి సీతారామయ్య, గుర్రం ఎల్లన్న, సూరె వెంకటస్వామి, యక్కలి భాగ్యారావు, యక్కలి రాంబాబు, డి.చిన్న సీతారామయ్య, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వివిధ విభాగాల పార్టీ నాయకులు కె.ఓబుల్‌రెడ్డి, ఏకుల ముసలారెడ్డి, ఆర్.అరుణాబాయి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

తాళ్లూరు: ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఎంఈఓ జి.సుబ్బయ్య, ఏపీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ హనుమంతరావు పాల్గొన్నారు. ఉమ్మడి సర్వేతో పాటు పలు సమస్యలపై వినతులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

పత్తి పంటలో యాజమాన్యంపై శిక్షణ

కురిచేడు: మండలంలోని దేకనకొండలో మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో ఆత్మ ప్రకాశం జిల్లా సౌజన్యంతో పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణపై రైతులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ పత్తి వేసిన రైతులు పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే గులాబీ రంగు పురుగును సమర్థంగా నివారించవచ్చని తెలిపారు. రైతులు పత్తి పొలంలో గుడ్డిపూలు అనగా సంపూర్ణంగా తెరుచుకోకుండా ఉన్న పూలు, కాయ పైభాగంలో సన్నని రంధ్రం, పూ మొగ్గలు రాలుట, గుడ్డి పత్తి మరియు రంగు మారిన పత్తి, కాయ కింద భాగాన తొనల మధ్య గోడలపై గుండ్రటి చిన్న రంధ్రాలు గమనించినట్లు ఏఓ తెలిపారు. లద్దె పురుగు మొగ్గలు పువ్వులోకి చొరబడి లోపల పదార్థాన్ని తిని నష్టపరుస్తాయని తెలిపారు. పుష్పాల్లోకి ప్రవేశించినప్పుడు ఆకర్షక పత్రాలు విప్పారకుండా ముడుచుకొని పోతాయని, మొక్కలు గుడ్డిపూలుగా మారతాయని చెప్పారు. లేత కాయలకు సన్నటి బెజ్జాలు చేసి లోపలికి దూరి నష్టపరుస్తాయని తెలిపారు. సమగ్ర సస్యరక్షణ చర్యల్లో భాగంగా ముందుగా గుడ్డిపూలు కనిపించిన వెంటనే పీకి వేసి తగలబెట్టాలని, పురుగు అంచనా వేసేందుకు ఎకరాకు 10-15 చొప్పున లింగాకర్షణ బుట్టలు పత్తి విత్తిన 35-40 రోజుల లోపల పంట కంటే ఒక అడుగు ఎత్తులో అమర్చుకోవాలని తెలిపారు. అనంతరం ఆత్మ బీటీఎం వై.నాగభూషణం మాట్లాడారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

- హెచ్‌డీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే తాటిపర్తి
- ఎక్స్‌రే, థైరాయిడ్ విభాగాలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్య పరిధిలోని నిరుపేద గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేలా వైద్యాధికారులు కృషి చేయాలని యర్రగొండపాలెం శాసన సభ్యుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ వైద్యాధికారులను కోరారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం హాస్పటల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన వైద్యశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతం పెద్దదోర్నాల మండల పరిధిలో ఎన్నో గిరిజన గూడేలు, తండాలు ఉన్నాయన్నారు. అటువంటి చెంచు గిరిజనులు, నిరు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని చెప్పారు. దీంతో పాటు వైద్యశాల నిర్వహణకు సంబంధించిన నిధులు సక్రమంగా వినియోగించాలని ఆదేశించారు. సౌకర్యాలు మెరుగు పర్చుకోవాలని సూచించారు. మారుమూల ప్రాంతంలో ఉన్న వైద్యశాలైనందున అత్యవసర సేవలు చేయాల్సి వచ్చినప్పుడు వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చూడాలని సూపరింటెండెంట్ మహేశ్వరిని కోరారు. వైద్యశాలలో అవసరాలకు సరిపడా మందులు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తాటిపర్తి సూచించారు. అత్యవసరమైన రోగులకు ప్రత్యేకంగా నేషనల్ హైవే అథారిటీకి సంబంధించిన ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో పాటు శస్త్ర చికిత్సలు చేసేందుకు సీయాం మెషిన్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. పోస్టుమార్టం గది ఏర్పాటు విషయమై అధికారులతో చర్చించి సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌రే, థైరాయిడ్ విభాగాలను ఆయన ప్రారంభించారు. వైద్యాధికారులు వైద్య సంజీవ్, ఖాదరయ్య, లావణ్య, మౌనిక, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, లాలూ నాయక్ పాల్గొన్నారు.



ఎక్స్‌రే యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

టీడీపీ కార్యకర్తలకే ఉపాధి కల్పించడం దుర్మార్గం



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఒంగోలు టౌన్ : గత 20 ఏళ్ల నుంచి పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన వారి స్థానంలో, రిటైరైన వారి స్థానంలో టీడీపీ కార్యకర్తలకు ఉపాధి చూపడం దుర్మార్గమని సీఐటీయూ నగర కార్యదర్శి టీ మహేష్ విమర్శించారు. చనిపోయిన, రిటైర్డ్ అయిన వారి కుటుంబ సభ్యులకు ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నగరంలోని అన్నీ మస్టర్ పాయింట్ల వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 115 మంది మేస్త్రీలను విధుల నుంచి తొలిగించిందని, కూటమి కార్యకర్తలు 50 మందిని మేస్త్రీలుగా, సూపర్‌వైజర్లుగా నియమించి వారిచే పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. నగర కార్పొరేషన్లో మేస్త్రీ వ్యవస్థను రద్దు చేసి కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పుకున్న కూటమి నాయకులు అదే వ్యవస్థను కొనసాగించడం ద్వారా ప్రజల్ని, కార్మికుల్ని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ కూటమి కార్యకర్తలకు మాత్రమే ఉపాధి కల్పించడం సరైన పద్ధతి కాదన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసరావు మాట్లాడుతూ చెత్త సేకరణ వాహనాలను నిలిపివేసి డ్రైవర్లను తొలిగించడంతో పారిశుధ్య కార్మికులపై పని భారం పెరిగిందని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్మికులను వ్యక్తిగత పనులకు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. కార్మికుల సంఖ్య పెంచకుండా వారిపై పనిభారం పెంచడం, బెదిరింపులకు గురిచేయడం, రాజకీయ జోక్యం చేసుకోవడం ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయమ్మ, రత్నకుమారి, సామ్రాజ్యం, నరసింహ, రాములు, లక్ష్మీకాంతం, బాబు, శ్రీనివాసరావు, సుబ్బారావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

చీమకుర్తి రూరల్: ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరమని మండల అభివృద్ధి అధికారి కె.రాఘవేంద్ర అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ సచివాలయం పరిధిలోని ప్రజలందరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ అజిత, ఏఓ శ్రీనివాసరావు, సునీల్, శాంతిప్రియ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవేంద్ర, వేదికపై ఎంపీపీ శ్రీనివాసరావు, తదితరులు